క్లుప్తంగా

జోన్-5 'స్పందన'కు ఆరు వినతులు



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63వ వార్డులకు సంబంధించి నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 06 వినతులు అందాయి. వాటిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, రెవెన్యూ విభాగానికి 02, యూసీడీ విభాగానికి 02 వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జెడ్సీ సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1, 2 టీఎస్ఎస్ రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వో బాబూరావు, ఈఈలు శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్‌ప్లానింగ్ టీపీవో ఎం.శ్రీలక్ష్మి, అవరంజిత, ఏపీడీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్



రోడ్డుకు అడ్డంగా వేలాడుతున్న కేబుల్ వైరు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్ కొత్త పోలీస్ క్వార్టర్స్ వద్ద రోడ్డుకు అడ్డంగా కేబుల్ వైర్ ప్రమాదకరంగా వేలాడుతోంది. వాహన చోదకులు వేగంగా వచ్చి ఈ వైరుకు తగిలి పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. రెండు రోజుల నుంచి కిందకి వేలాడుతున్న ఈ తీగ సోమవారం ఉదయం నాటికి మరింత దిగిపోయింది. దీంతో వాహన చోదకులు ఆదమరిచి వెళ్తే మెడకు చుట్టుకుంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేబుల్ యాజమాన్యాలపై జీవీఎంసీ అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

60, 61 వార్డుల్లో 'ఆడారి' పర్యటన నేడు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మంగళవారం 60, 61 వార్డుల్లో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు 60వ వార్డులో కార్పొరేటర్ పి.వి.సురేష్ ఆధ్వర్యంలో పార్టీ వార్డు నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు 61వ వార్డు గాంధీజీ వీధి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 60వ వార్డు గుల్లలపాలెంలో జరిగే కార్పొరేటర్ పి.వి.సురేష్ జన్మదిన వేడుకల్లో ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు.

ముత్యమాంబ జాతరకు ఏర్పాట్లు



అమ్మవారు

కంచరపాలెం: కంచరపాలెం కూడలిలో కొలువైన ముత్యమాంబ అమ్మవారి వార్షిక నవరాత్రి జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 19న తొలేళ్ల సంబరంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, పుట్టబంగారం ఆలయం వద్ద పూజాదికాలు జరపనున్నారు. 20వ తేదీన ప్రధాన పండగ, 27వ తేదీన అమ్మవారి మారువారం జాతర, అన్నదానం నిర్వహించనున్నట్లు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘ సభ్యులు తెలిపారు. ఆలయ పరిసరాలు, గాలి గోపురాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు, సాంస్కృతిక, నృత్య కార్యక్రమాల నిర్వహణకు వేదికలను, విద్యుత్ దీపాలంకరణలు సిద్ధం చేస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఎరక్క వచ్చి.. ఇరుక్కుపోయి!

- ఎన్ఏడీ బ్రిడ్జి దిగువ రోడ్డులోకి భారీ వాహనాలు
- భీమ్‌లు తగిలి నిలిచిపోతున్న వైనం
- హైట్ బారియర్స్ లేకపోవడమే కారణం
- నిత్యం ఇదే తరహా ఇబ్బందులు



ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ కింద ఇరుక్కుపోయిన ట్యాంకర్‌ను క్రేన్‌తో తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)



ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దిగువ భీమ్ తగిలి ఆగిన కంటైనర్ (ఫైల్)

గోపాలపట్నం: అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారుల అవగాహన లేమితో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఎన్ఏడీ జంక్షన్‌లోని ఫ్లైఓవర్ దిగువ రహదారిలో భారీ వాహనాలకు అనుమతి లేదు. అయితే ఈ విషయమై వాహన దారులకు తెలిసేలా సూచికలు లేకపోవడంతో కొంతమంది భారీ వాహనాలతో దిగువ రోడ్డులోకి వెళుతున్నారు. దీంతో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఎరక్కపోయి వచ్చి ఇరుక్కుపోయాం దేవుడా.. అంటూ వాపోతున్నారు.

వరుస ఘటనలు

ఇటీవల ఆయిల్ ట్యాంకర్ ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దిగువ రోటరీలో రావడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ వద్ద ఇరుక్కుపోయింది. అంతకు ముందు గోపాలపట్నం వైపు నుంచి వచ్చి ఫ్లైఓవర్ పిల్లర్ భీమ్‌ను ఢీకొని కంటైనర్ ఆగిపోయింది. ఇలా వారంలో కనీసం నాలుగైదు భారీ వాహనాలు ఇరుక్కుపోతున్నాయి.

హైట్ బారియర్లు లేకపోవడం వల్లే...

ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నాలుగు రోడ్లలో మూడు వైపులా హైట్ బారియర్స్ లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పాడుతోంది. గోపాలపట్నం నుంచి మర్రిపాలెం వెళ్లే రహదారిలో, మర్రిపాలెం నుంచి గోపాలపట్నం వెళ్లే రహదారితో పాటు నగరం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారిలో హైట్ బారియర్స్ లేవు. దీంతో భారీ వాహనాలు దిగువ రోడ్డు ప్రయాణించి ఫ్లైఓవర్ కింద ఇరుక్కుంటున్నాయి.

అధికారుల నిర్లక్ష్యమే కారణం!

ఇక్కడి నాలుగు రోడ్లలో హైట్ బారియర్స్ గతంలో ఏర్పాటు చేశారు. అయితే పలు ప్రమాదాల్లో ఇవి విరిగి పోయాయి. ఆ తర్వాత వాటిని తొలగించేశారు. తిరిగి కొత్తవి నిర్మించలేదు. ఇటీవల ఇక్కడి ఇబ్బందులు తెలుసుకునేందుకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో పాటు వుడా ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు పరిశీలించారు. హైట్ బారియర్స్ గురించి ప్రస్తావించారు. వీటిని త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. నెలలు గడిచినా కార్యాచరణ కానరాలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైట్ బారియర్స్ ఏర్పాటు చేసినా వీటికి 200 మీటర్ల ముందు హైట్ బారియర్స్ ఉన్నట్లు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఇక్కడి వారు కోరుతున్నారు.



కరాసా నుంచి గోపాలపట్నం వెళ్లే రోడ్డులో కానరాని హైట్ బారియర్స్

భారీ వాహనాలు ఎగువ రోటరీలోనే వెళ్లాలి

భారీ వాహనాలు ఎగువ రోటరీలోనే వెళ్లాలి. దిగువ రోడ్డులో వెళ్లడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దిగువ రహదారిలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లకు మాత్రమే అనుమతి ఉంది. భారీ వాహనాలు దిగువ రోడ్డులో వెళ్లడం వల్ల బ్రిడ్జ్ డామేజీ అవుతుంది. ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పాడవుతుంది. అవగాహన కల్పించేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

– మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ, కంచరపాలెం

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'



గాంధీజీ వీధిలో కరపత్రాలు అందజేస్తున్న కన్వీనర్లు, గృహసారథులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. సోమవారం వార్డులోని గొల్ల వీధి, గాంధీజీ వీధి సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ప్రజాభిప్రాయాలు సేకరించారు. స్థానికులకు ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు చట్టినూకరాజు, ఎన్.వి.రమణ, బూస అప్పలరెడ్డి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- వార్డులోని శెట్టిబలిజ వీధిలో సచివాలయ కన్వీనర్ బాలు ఇళ్ల వద్దకు వెళ్లి నాడు చంద్రబాబు ప్రభుత్వ పాలనలో ప్రజలు ఏ విధంగా వంచనకు గురయ్యారు.. నేడు సీఎం వైఎస్ జగన్ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఎంత లబ్ధి పొందుతున్నారో వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గృహసారథులు పాల్గొన్నారు.

హిమాచల్‌నగర్ రోడ్ల మరమ్మతులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్‌లోని బీటీ, సీసీ రోడ్లు బాగుపడనున్నాయి. ఇక్కడి రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ సమస్యను కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆమె వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు సమస్యను తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి రూ.15 లక్షల నిధులను రోడ్ల మరమ్మతులకు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఈ పనులకు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి నమ్మి గౌరీశ్వరరావుయాదవ్, కోశాధికారి, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు కుంచుమాంబ పండగ



కుంచుమాంబ అమ్మవారు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం కుంచుమాంబ అమ్మవారి పండగ మంగళవారం నిర్వహించనున్నారు. సోమవారం తొలేళ్ల సంబరం, సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు వైభవంగా జరిగింది. మంగళ వారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు.

భూగర్భ పైప్‌లైన్ పనులతో ఇబ్బందులు



పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ సుదర్శనరావు

మల్కాపురం: మల్కాపురంలోని కోస్ట్‌గార్డు (ప్రధాన కార్యాలయం) పరిపాలన భవనం తో పాటు కోస్టుగార్డు క్వార్టర్స్‌లో ఉండే వారి నీటి అవసరాల కోసం సుమారు రూ. 9 కోట్లతో రెండు రోజుల నుంచి భూగర్భ పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే ఆర్కే పురం నుంచి మల్కాపురం కోస్టుగార్డు పరిపాలన భవనం వరకు గల సర్వీసురోడ్డు మధ్యలో గోతులు తవ్వుతున్నారు.దీంతో ఆ మార్గంలో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు. గోతులు తవ్విన వెంటనే పైపులు అమర్చి,ఆ వెంటనే గోతులు పూడ్చాలి.కానీ అటువంటి చర్యలు ఏమీ కాంట్రాక్టర్ చేపట్టకపోవడంతో ఆ మార్గాన వచ్చే పాదచారులు,వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం పనుల వల్ల మల్కాపురం వద్ద ట్రాఫిక్ సమస్య నెలకుంది. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శనరావు సిబ్బందితో వచ్చి సమస్యను పరిష్కరించారు.

జోన్-5 ఏపీడీగా శైలజ బాధ్యతల స్వీకరణ



విధుల్లో చేరిన ఏపీడీ శైలజ, సీడీవో

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 యూసీడీ ఏపీడీగా శైలజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఆమె తన నియామక పత్రాన్ని అందజేశారు. శైలజతోపాటు కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా జోన్-5కు 16 మందిని జీవీఎంసీ ప్రాజెక్ట్ అధికారి నియమించడంతో వారంతా విధుల్లో చేరారు. జోన్-5 పరిధిలోని 24 వార్డుల్లో సీడీవోలను నియమించనున్నట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు.

రోడ్లు, కాలువల అభివృద్ధికి ప్రణాళికలు



గెడ్డను పరిశీలిస్తున్న భాస్కరరావు, డీఈ విజయ్‌కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92 వార్డుల్లో సోమవారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, డీఈ విజయ్‌కుమార్‌తో కలసి పర్యటించారు. 91వ వార్డులోని రెడ్డి వీధి, జయప్రకాష్‌నగర్, గవర వీధి ప్రాంతాల్లో రోడ్లు, కాలువలను పరిశీలించారు. వీటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని బెహరా సూచించారు. 92వ వార్డు వెంకటాపురంలో రోడ్లు, డ్రైనేజీలు.. బంటా కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడల నిర్మాణం వంటి పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన డీఈ త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేసి త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పర్యటనలో వైఎస్సార్‌సీపీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, గేదెల మురళీకృష్ణ, దేరెడ్ల సత్యనారాయణ, గొంతిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి సమస్యకు పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం కొండవాలు ప్రాంత ప్రజలకు రహదారి సమస్య తీరింది. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు త్రినాథపురంలో పర్యటిస్తున్న సమయంలో కొండవాలు ప్రాంత ప్రజలు పడుతున్న రహదారి సమస్యను వివరించారు. రాకపోకలు సాగిస్తున్న రహదారిలో మంచి నీటి పైప్‌లైన్ అడ్డంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన విషయాన్ని సంబంధిత మంచినీటి విభాగ అధికారులకు తెలియజేయగా సోమవారం ఏఈ కనకరాజు సిబ్బందిని పంపించి రహదారికి అడ్డంగా ఉన్న పైప్‌లైన్‌ను తొలగించి అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. పనులను వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రచార భేరి' సభను జయప్రదం చేద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: సీపీఎం కంచరపాలెం జోన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైతుబజార్ వద్ద ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించి దేశాన్ని కాపాడాలనే నినాదంతో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ నెల 26న విశాఖ స్టీల్‌ప్లాంట్ కూర్మన్నపాలెం గేటు దగ్గర నిర్వహించే బహిరంగ సభలో సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యుడు, బీవీ రాఘువులు, సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు నారాయణ పాల్గొంటున్నారని చెప్పారు. ప్రజలందరూ తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఈశ్వరరావు, పి.పూర్ణ, వరలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

చెత్త తొలగించండి



ఎన్ఏడీ ఫ్లైఓవర్ దిగువన పేరుకుపోయిన చెత్తాచెదారం

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లైఓవర్ దిగువ ప్రాంతంలో చెత్త పేరుకు పోతోంది. దీన్ని తొలగించేవారే కరువయ్యారు. జీవీఎంసీ 90వ వార్డు ప్రాంతంలో కొన్ని రోజులుగా చెత్త పేరుకుపోయి ఉంది. పారిశుధ్యం సిబ్బంది ఫ్లైఓవర్ దిగువ పార్కింగ్ ప్రాంతం వైపు తొంగి చూసిన దాఖలాలు లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకు పోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్త తొలగించాలని కోరుతున్నారు.

రోల్ మోడల్‌గా యువత



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భవిష్యత్తు తరానికి ప్రస్తుత యువత రోల్ మోడల్‌గా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో సోమవారం నిర్వహించిన ఐఏఎస్ఈ ఫ్రెషర్స్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా విద్యార్థులు మారాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు వీసీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే పూజ నిర్వహిస్తారు.

ప్రజా పోరాటాలతో కేంద్రానికి గుణపాఠం



ప్రచారంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

గాజువాక: ప్రజా పోరాటాలతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి ప్రజలు ముందుకు రావాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ప్రచార భేరి పాదయాత్ర సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు దుర్గానగర్, సుందరయ్య కాలనీలలో సోమవారం ప్రచారం చేశారు. సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విధానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలవల్లే ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ధరలను తగ్గించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్మికవర్గాన్ని రోడ్డున పడేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంలేదని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు అప్పారి విష్ణుమూర్తి, గంగాధరరావు, డి.శ్రీనివాసరావు, ఎం.తాతాబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలి'

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి నెల్లిముక్కు మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీలో పెంటమాంబ అమ్మవారి ఆలయం వరకు సోమవారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా మళ్ల

ఉక్కునగరం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ ఉపాధ్యక్షునిగా మళ్ల జగదీశ్వరరావు ఎన్నికయ్యారు. బీహార్ రాజధాని పాట్నాలో గత వారం జరిగిన బీఎంఎస్ 20వ త్రైవార్షిక మహాసభలకు దేశవ్యాప్తంగా జాతీయ పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర స్థాయి పదాధికారులు, కార్యవర్గ సభ్యులు సుమారు 2200 మంది హాజరయ్యారు. జాతీయ సమస్యలపై చర్చలు జరిగాయి. అనంతరం మూడేళ్ల కాలపరిమితితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మళ్ల జగదీశ్వరరావును మూడో సారి జాతీయ ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు.